క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాన్ దిన్నె తండా, చంద్రబండతండాలలో నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సిబ్బంది, కొల్లాపూర్ ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కొల్లాపూర్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. మారేడుమాన్ దిన్నెతండాకు చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఈసూఫ్‌అలీ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. డీటీఎఫ్‌సీఐ కల్యాణ్, తెలకపల్లి సీఐ రమణయ్య, ఎస్‌ఐ అరుణ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని వనపర్తి రోడ్డు మార్గంలో 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని కారు శనివారం ప్రమాదవశాత్తు ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేటకు చెందిన మేఘ, ఇద్దరు చిన్నారులతో కలిసి వనపర్తి జిల్లా గోపాల్‌పేట నుంచి కారులో ప్రయాణిస్తున్నారు. మండల కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. దీంతో కారులో ఉన్న బెలూన్లు ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియాసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

లింగాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాల కల్పనకు రూ.26 లక్షల ప్రతిపాదనలు సంబంధిత ఉన్నతాధికారులకు పంపించినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 26 పాఠశాలలకు ఒక్కో పాఠశాలలో రూ.లక్ష చొప్పున ఖర్చు చేస్తామని పేర్కొన్నారు

19న పురస్కారం అందజేత

నాగర్‌కర్నూల్: ఈ నెల 19న బుధవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లో చింతలపల్లి నిర్మలాదేవి నారాయణరావు జీవన సాఫల్య పురస్కారం – 2024 సంబంధించి వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత నాగవరం బాల్‌రాంకు అందజేయనున్నట్లు సీఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత సి.భాస్కర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రచించిన 'మనకల నిజం' పుస్తకావిష్కరణ ఉంటుందని వివరించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ఒబేదుల్లా కొత్వాల్ హాజరవుతారని పేర్కొన్నారు. కవులు కళాకారులు, సాహితీ బంధువులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ముందుగా శివాలయంలో శివ లింగాన్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. పూజల్లో ఆలయ అర్చకుడు శాంతికుమార్, ఉమ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక



నాగర్‌కర్నూల్ క్రైం: ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా కమిటీని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తెప్ప శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎండీ వాజిద్ అలీ, కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఏ.రవి కుమార్, సహాయ కార్యదర్శులుగా బి.చంద్ర శేఖర్, బి.శేఖర్, కోశాధికారిగా వి.రాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా సి.బాలకుమార్, ఎం.శ్రీనివాసులు, ఎండీ జహంగీర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మొహమ్మద్ దర్వేష్ ఎన్నికయ్యారు.

వాహనాల తనిఖీ చేసిన ఎస్‌ఐ



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శనివారం ఎస్‌ఐ రవి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బక్రీద్ పండుగా సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూగ జీవాలను అక్రమంగా తరలిస్తే చట్ట రీత్య నేరం అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డా మల్లురవి అన్నారు. శనివారం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పారదర్శక పాలన అందిస్తామన్నారు. అవినీతి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీపీ మంత్రిని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, డీఆర్‌డీఓ ఓబులేష్, జెడ్పీసీఈఓ గోపాల్‌నాయక్, డీఈఓ గోవిందరాజులు, తహసీల్దార్ ఈసూఫ్‌అలీ, వైస్ ఎంపీపీ దీపిక, మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగేంద్రంపాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కొల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ మాలె రజితభాస్కర్‌గౌడ్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు సభ్యులు తీర్మానం చేసి పంపించారు. ఎంపీటీసీ శంకర్‌నాయక్, ఏఈ రాకేష్‌రెడ్డి, వైద్యుడు చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ పట్టాభిరామారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వద్ద నూతన గదుల నిర్మాణ పనులకు శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమగ్ర సర్వశిక్ష నిధి నుంచి రూ.81 లక్షల నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీలు మౌనిక, శివశంకర్, మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్ లత, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జీఓ నంబర్ 68ని విడుదల చేసి కేటగిరీల వారిగా వేతనాలను పెంచి అమలు చేయాలన్నారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. పక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ.21 వేలు ఇస్తున్నారని తెలంగాణలో కేవలం రూ.16500 వేతనం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, కార్మికులు, కురుమయ్య, వెంకటయ్య, బంగారి, పరుషరాములు, కృష్ణ, భారతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీకి వినతి

కొల్లాపూర్: ఎక్సైజ్ శాఖలో వినియోగిస్తున్న ప్రైవేటు వాహనాలకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవికి వాహనాల డ్రైవర్ల సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. శనివారం వారు కొల్లాపూర్‌లో ఎంపీ, మంత్రిని కలిశారు. రెండేళ్లుగా వాహనాలకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని వారు మంత్రికి వివరించారు. త్వరలోనే పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా చూస్తానని డ్రైవర్ల సంఘం నాయకులకు ఆయన పేర్కొన్నారు. ఎండీ.షకీల్, అన్వర్‌పాషా, ఆనంద్‌గౌడ్, విజయ్‌కుమార్, భగవాన్‌రెడ్డి, ఉస్మాన్, పరమేష్, సైదులు, శివ ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు బీజేపీ నాయకులు అందజేశారు. కేఎల్‌ఐ కాల్వలకు మరమ్మతు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీమేష్, కార్యదర్శి తిరుమల్, ప్రవీణ్, శేఖర్, మద్దిలేటి, నరేష్, విజయ్, ప్రశాంత్, శివ పాల్గొన్నారు.

పాల బిల్లుల కోసం ఎమ్మెల్యేకు..



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న పాడి రైతులు

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విజయడెయిరీ సంస్థకు పాలు పోస్తున్న రైతులకు పాల బిల్లులు సకాలంలో రావడం లేదని కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు రాచమొల్ల శ్రీనివాసులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మే 1 వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు బిల్లులు రాలేదన్నారు. 15 రోజులకు ఒకసారి వచ్చే బిల్లు 45 రోజులైన రావడం వాపోయారు. పశువుల దానా 8 నెలలుగా సరఫరా చేయడం లేదని వివరించారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అభంశుభం తెలియని చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడటం దారుణమన్నారు. చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరంజన్, తిరుపతయ్య, కొత్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక



చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఏలే అభినవిశ్వరి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్స్(ఎన్‌ఎంఎంఎస్) కు ఎంపికైంది. పాఠశాల జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం శనివారం విద్యార్థినిని అభినందించి, సన్మానించారు. విద్యార్థికి ఇంటర్మీడియట్ వరకు ప్రతి ఏడాది రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందుతుందని హెచ్‌ఎం తెలిపారు. ఉపాధ్యాయులు యాదగిరి, కమాలాకర్‌రావు, అంజయ్య, రాజేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు



కొల్లాపూర్: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రశాంతి నర్సింగ్‌హోంలో క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రికి చెందిన వైద్యులు శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. 152 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాంపు ఇన్‌చార్జ్ ప్రసాద్, సేవాసమితి ప్రతినిధులు న్యాయవాది శ్రీనివాసరావు, డాక్టర్ హిమకుమారి, డాక్టర్ విజయ్‌కుమార్, పీఈటీ శ్రీనివాసరావు, శోభారాణి, రాధమ్మ, రేణుత తదితరులు పర్యవేక్షించారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తాం



వెల్దండ: దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోషమ్మతండా, పోతేపల్లి గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తిభావంతో మెలగాలన్నారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటమ్మ, మంగ్లీ, నాయకులు కాడురామ్‌నాయక్, టక్యానాయక్, లక్ష్మణ్, అజిత్, తానేష్, కిరణ్, రమేష్, రవి, రాము, లాలు, విజయ్ తదితరులు ఉన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



తాడూరు: మండలంలోని అల్లాపూర్, మేడిపూర్ గ్రామాల్లో విద్యార్థులకు శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా చదువులతల్లి సరస్వతీదేవి చిత్రపటానికి హెచ్‌ఎంలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రభ, కృష్ణారెడ్డిలు ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాం దుస్తులను శనివారం హెచ్‌ఎం బషీర్ అహ్మద్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



కోడేరు: రాష్ట్రంలో ఉన్న 20 వేల మంది ఎస్జీటీలకు పండిత్ ప్రమోషన్లలో అవకాశం ఇవ్వాలని టీఎస్ పీటీఏ జిల్లా అధ్యక్షుడు బోరెల్లి రాజు అన్నారు. శనివారం మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎస్జీటీలకు పండిత్ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహ, కురుమయ్య, అగ్గరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మేన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

ఉప్పునుంతల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మేన్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషలాఫీసర్ సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో ఇరువురు వీధి రోడ్డును ఆక్రమించుకొని కట్టిన నిర్మాణాలను శనివారం డీపీఓ ఆదేశాలపై ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వెంకటయ్య, డీఎస్‌పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామానికి చెందిన మాధవరం రాజల్‌రావు, దొంతినేని రాజేశ్వరరావులకు సంబంధించిన పొలంలో కొన్నేళ్ల కిందట ప్లాట్లు చేసి విక్రయించారు. ప్రస్తుతం ఆ ప్లాట్లలో ఇతరులు ఇండ్లు నిర్మించుకున్నారు. రోడ్డుకు ముందు వరుసలోనే ఉన్న స్థలంలో రాజల్‌రావు ఇంతకుముందే 12 అడుగుల రోడ్డును వదిలి ఇంటిని నిర్మించుకోగా రాజేశ్వర్‌రావు ఇటీవల గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొంది ఇంటి నిర్మాణం పనులు మొదలుపెట్టి రెండు అడుగుల మేర రోడ్డును ఆక్రమించాడు. దాంతో ఇరువురి మధ్య స్థల వివాదం చోటుచేసుకుంది. రాజల్‌రావు ఆరు అడుగుల రోడ్డును ఆక్రమించి సిమెంట్ కడీలు పాతి బేస్‌మెంట్ వేశాడు. ఇరువురు వీధి రోడ్డును అక్రమించుకొని ఇతరులకు ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు అందుకున్న డీపీఓ కృష్ణ రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చి ఇరువురికి నోటీసులు ఇచ్చారు. వారు స్పందించకపోవడంతో అధికారులు రోడ్డు అక్రమణలను తొలగించారు. ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ కార్మిక బాట కార్యక్రమంలో భాగంగా శనివారం అచ్చంపేటలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రధాన సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్ని రంగాల కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బుద్ధారం మురహరి, సాయిబాబు, పర్వతాలు, శ్రీనివాసులు, లక్ష్మణ్ నాయక్, శేఖర్, మహబూబ్‌అలీ, గౌస్‌పాష, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో అధిక దిగుబడి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఈఓ భార్గవి

మన్ననూర్: చిరుధాన్యాలు సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అమ్రాబాద్ మండల వ్యవసాయ విస్తరణ అధికారిణి భార్గవి రైతులకు సూచించారు. శనివారం అమ్రాబాద్ మండలం సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల్లో రైతులు వానాకాలం సాగు చేస్తున్న పంటలపై కోనేరు స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రైతులకు ఆమె పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు ప్రతి ఏట సాగు చేస్తున్న ప్రధానమైన పంటలు పత్తి, మొక్కజొన్న తదితర పంటలతో పాటూ చిరుధాన్యాలైన జొన్న, రాగి, సజ్జలు, కొర్రలు తదితర పంటలను కూడా సాగు చేసి అధిక దిగుబడులను పొందాలని కోరారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎండీ ఇస్మాయిల్, సిబ్బంది శ్రీనివాసులు, తిరుపతయ్య, గ్రామస్తులు బయ్యప్ప, ఈదయ్య, గురువయ్య, మల్లయ్య, పెద్దులు, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ల సర్వే పనుల పరిశీలన



తాడూరులో వివరాలను తెలుసుకుంటున్న సిబ్బంది

తెలకపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ సర్వేలో భాగంగా శనివారం ఎంపీపీ కొమ్ము మధు, ఎంపీడీఓ కృష్ణయ్య ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పూర్తి చేసిన పనులను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం బాలస్వామి, ఎంపీటీసీ సభ్యులు రమేష్, విజయలక్ష్మి, ఎంపీఓ వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడూరు: మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్‌ల సర్వేను మండల కేంద్రంలో శనివారం ఎంపీపీ జ్యోతిపరోసియా ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందితో ఇంటింటికి తిరిగి సర్వే నమోదు వివరాలను చేపట్టారు. 2, 3 వార్డులలో నీరు సక్రమంగా రావడంలేదంటూ కాలనీవాసులు అధికారులకు వివరించారు. వారం రోజులుగా నీరు సరిపోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో కార్యదర్శి పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

బ్యాగుల పంపిణీ



దాతలతో విద్యార్థులు

తాడూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆయా గ్రామాల్లోని దాతలు అందించే సహాయ సహకారాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని యత్మాతాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, రణబీర్‌రెడ్డిలు ఆర్థిక సహాయ సహకారంతో 30 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, గ్రామస్తులు ఉన్నారు.

పేదలందరికీ భూములు పంపిణీ చేయాలి



కొల్లాపూర్: మండలంలోని మొలచింతలపల్లి గ్రామ సమీపంలో అసద్‌పూర్ శివారు భూములను అర్హులకు పంచాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సురభి రాజసంస్థానానికి చెందిన వేల ఎకరాల భూములు అసద్‌పూర్ శివారులో ఉన్నాయని, ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులకే వాటిపై హక్కులు కల్పించాలని ఆయన కోరారు. మండల కార్యదర్శి శివవర్మ, దశరథం, నాయకులు సలీమ్, సురేందర్, రాజు, రామకృష్ణ తదితరులున్నారు.

పెంట్లవెల్లి: పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి పర్వతాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. పెంట్లవెల్లిలో ఉన్న సర్వే నెంబర్ 22, 27 లోగల 14 ఎకరాల 36 కుంటల భూమిని, 449లో ఉన్న 62 ఎకరాలను పేదలకు పంచాలన్నారు. ఈశ్వర్, హనుమంతు, ఎల్లగౌడ్, రవి, గోపాల్, గోవిందమ్మ, వెంకటమ్మ, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.2.68 లక్షల ఆదాయం

లింగాల: మేజర్ గ్రామ పంచాయతీకి 2024–25 సంవత్సరానికి గాను శనివారం నిర్వహించిన తైబజార్ వేలం ద్వారా రూ.2.68 లక్షల ఆదాయం సమకూరింది. పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వేలం ఏర్పాటు చేయగా ఇందులో 8 మంది పాల్గొన్నారు. సాయిచరణ్ అత్యధికంగా వేలం పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



ఊర్కొండ: అమెరికా పర్యటన పూర్తి చేసుకొని తిరిగి వచ్చిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిని మండల నాయకులు శనివారం ఎయిర్‌పోర్టులో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమీ, మనోహర్‌రెడ్డి ఉన్నారు.